మహబూబాబాద్ జిల్లా గార్లలో శ్రీసారలమ్మ జేఎల్ గ్రూపునకు సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రానికి రూ.25లక్షల రుణం మంజూరైంది. గార్లలోని ఎస్‌బీఐలో ఖాతా తెరిచి తమ వాటాధనం రూ.2.50 లక్షలు జమచేశారు. ఇక్కడ బ్యాంకు లోన్ రూ.7.50 లక్షలతో సంబంధం లేకుండానే డీఆర్‌డీఏలో పని చేసే ఓ అధికారి ఐటీడీఏ అధికారులతో కలిసి యూనిట్ ప్రారంభిస్తున్నామని చెప్పి, రూ.5లక్షల సబ్సిడీని బ్యాంకు ఖాతాలో జమ చేయించారు. ఇందులో నుంచి రూ.3లక్షలు పి.శ్రీనివాస్ అనే వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. మిగతా రూ.2లక్షలు జేఎల్ గ్రూపు డ్రా చేసుకున్నట్టుగా బ్యాంకు రికార్డులున్నాయి. ఈ పథకం కింద ఖాతా తెరిచిన తరువాత యూనిట్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసిన కంపెనీకే పేమెంట్లు చేయాలి. వ్యక్తిగతంగా వాడుకోవడానికి వీలులేదు. అయితే పి.శ్రీనివాస్ ఎవరు.. ఆయనకు ఎందుకు జమ చేశారనేది చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసమని రూ.3.80లక్షలు ఎన్‌పీడీసీఎల్‌కు డీడీ రూపంలో చెల్లించారు. బ్రిక్స్ యూనిట్ కోసం ప్రత్యేకంగా ఇంత పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకనేది సమాధానం లేని ప్రశ్న. బయ్యారంలో కూడా సిమెంట్ ఇటుకల యూనిట్‌లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అశ్వారావుపేట, దమ్మపేటలో కొండరెడ్లకు మంజూరైన యూనిట్లు, భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లోని కోయలకు మంజూరైన యూనిట్లలో సబ్సిడీ వారికి తెలియకుండా గిరిజన సంక్షేమశాఖ అధికారులు స్వాహా చేసినట్టు సమాచారం. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశల, లింగాల, ములుగు మండలం జంగాలపల్లి, కొత్తగూడ మండలం దొరవారి వేంపల్లి, పొగులపల్లి గ్రామాల్లోని జేఎల్ గ్రూపులకు మంజూరైన నిధులూ దారి తప్పినట్టు తెలుస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో రూ.40కోట్లకు పైగా సబ్సిడీ నిధులు ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు పక్కదారి పట్టించారని సమాచారం.

### పీవోలకు చెక్ పవర్!

ప్రభుత్వ పథకాల కోసం ఏర్పాటు చేసుకునే లబ్ధిదారుల గ్రూపులో అధ్యక్ష, కార్యదర్శులకు చెక్‌పవర్ ఉంటుంది. ఆ ఇద్దరి పేరిటే బ్యాంకులో ఖాతా తెరుస్తారు. అయితే ఈ పథకంలో మాత్రం ఐటీడీఏ పీవోలు కూడా తమ పవర్ చూపిస్తున్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీవో.. లబ్ధిదారులతో పాటు తనకు కూడా చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు రాయడమే కాకుండా, చెక్కులపై సంతకాలు చేసేస్తున్నారు. దీంతో ఇతర ఐటీడీఏ పీవోలకు కూడా ఆశ పుట్టి జేఎల్ గ్రూపుల్లో తమకు కూడా జాయింట్ చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు వ్రాసి సాధించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### రూ.2.50లక్షలు తీసుకున్నరు



మేం పెట్టిన దాల్ మిల్ నాలుగేళ్లుగా మూత పడింది. బ్యాంకు నుంచి లోన్ ఇవ్వలేదు. సబ్సిడీ కూడా రాలేదు. మిషన్లు ఐటీడీఏ వాళ్లే ఇచ్చిండ్లు. మూడు రోజులు ట్రయల్ నడిపినం. ముడిసరుకు లేకపోవటంతో బంద్ జేసినం. మా వాటా కింద బ్యాంకుల జమ చేసిన రూ.5 లక్షల నుంచి కాంట్రాక్టర్ రంజిత్‌కు రూ.2.50 లక్షలు ఇచ్చినం. ఐటీడీఏ ఏపీవోతోపాటు మరో ఇద్దరు అధికారులు కాంట్రాక్టర్‌కు ఆ పైసలు ఇవ్వాలని చెప్పారు. మిల్ నడిపే రూమ్‌ను ఏదో రిపేర్ చేస్తామని తీసుకున్నారు. మళ్లీ ఇస్తామని చెప్పి నాలుగేళ్లవుతున్నా మా డబ్బులు ఇవ్వలేదు. సబ్సిడీ రావటం లేదు. దాల్ మిల్ నడవటం లేదు. మేం అన్ని రకాలుగా నష్టపోయాం.

- భూపతి శ్యామల,
కొత్తగూడ, జేఎల్ గ్రూపు అధ్యక్షురాలు

### చక్రం తిప్పింది ఆయనే!

గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలోని ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగే ఈ మొత్తం దందాలో కీలక పాత్ర పోషించారని సమాచారం. ఆ 'లక్ష్మీ'పుత్రుడు తనకు తానే రాష్ట్రంలో ఈ మిషన్ మేనేజర్‌గా చెప్పుకొంటూ సబ్సిడీ నిధులను అవినీతి అధికారులకు 'ప్రసాదం'లా పంచారనే చర్చ గిరిజన శాఖలో జరుగుతోంది. శాఖలోని ప్రధాన అధికారుల నుంచి ఐటీడీఏలోని కింది స్థాయి అధికారి వరకూ అందరినీ ఆయన వాటాలతో మేనేజ్ చేస్తున్నట్టు సమాచారం. గత ప్రభుత్వ హయంలో గిరిజనశాఖ మంత్రి సమీప బంధువు కూడా ఒకరు ఈ సబ్సిడీ స్వాహాపర్వంలో కీలకంగా ఉన్నట్లుగా సమాచారం. ఈ అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ జరిపించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

## హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ
# హరికృష్ణ సస్పెన్షన్ ఉత్తర్వులు కొట్టివేత

▸▸ సస్పెన్షన్‌పై హైకోర్టుకు వెళ్లిన మాజీ ఓఎస్డీ

▸▸ కాంపిటెంట్ అథారిటీ జారీ చేయలేదంటూ సస్పెన్షన్ ఉత్తర్వుల కొట్టివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌కు గురైన హకీంపేట స్పోర్ట్స్ పాఠశాల మాజీ ఓఎస్డీ టి.హరికృష్ణకు హైకోర్టులో ఊరట లభించింది. కాంపిటెంట్ అథారిటీ మాత్రమే జారీ చేయాలంటూ ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులను ధర్మాసనం కొట్టివేసింది. హరికృష్ణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను విధుల్లోంచి తొలగిస్తూ అప్పటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ అండ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి ఫిర్యాదు, విచారణ లేకుండా సస్పెండ్ చేయడం చెల్లదని, ఆధారాలు లేకపోయినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని యువజన వ్యవహారాలు, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారని, ఈ ఉత్తర్వులు చెల్లవని హరికృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ పశు సంవర్ధక శాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా నియమితులయ్యారని, 2020లో హకీంపేట స్పోర్ట్స్ పాఠశాలకు ఓఎస్డీగా డిప్యూటేషన్‌పై వెళ్లారని ఆయన తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు, కారణాలు లేకుండా, అధికార పరిధికి విరుద్ధంగా కేవలం ఆరోపణలు వచ్చాయని పేర్కొంటూ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పిటిషనర్ డిప్యూటేషన్‌పై క్రీడా శాఖకు వెళ్లారని, సరైన కారణాలు, విషయ తీవ్రత ఉన్నా కాంపిటెంట్ అథారిటీ మాత్రమే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయగలరని వ్యాఖ్యానించింది. ఈ కేసులో పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి అపాయింటింగ్ అథారిటీ అని.. ఇప్పటి వరకు ఎలాంటి చార్జి మెమో జారీ చేయలేదని గుర్తు చేసింది. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఉన్నందున సదరు సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టి వేస్తున్నట్లు తుది తీర్పు జారీ చేసింది.

## కుట్ర చేసి, ఇరికించి సస్పెండ్ చేశారు

▸▸ కవిత, శ్రీనివాస్ గౌడ్ స్వార్థానికి నన్ను బలి చేశారు

▸▸ మాజీ సీఎం పేషీలోని భూపాల్‌రెడ్డికి మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదని నాపై కుట్ర

▸▸ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ హరికృష్ణ ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గలేదన్న కారణంగానే తనను కుట్రపూరితంగా ఇరికించి.. సస్పెండ్ చేశారని హకీంపేట క్రీడా పాఠశాల మాజీ ఓఎస్డీ హరికృష్ణ తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలను తెలుసుకోకుండా అహంకారంతో ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారని, పైవారి మన్ననల కోసం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తనను బలి చేశారని ఆరోపించారు. గత ఏడాది హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన ఒక ఘటనకు సంబంధించి తనపై నమోదైన కేసు విషయంలో ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిందని పేర్కొంటూ సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీట్ల కేటాయింపు విషయంలో గతంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ఉన్న ఆంజనేయగౌడ్, ఆయన పీఏ (రిటైర్డ్) నర్సయ్య, శాట్స్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తనను ఒత్తిడికి గురి చేశారని, అప్పటి సీఎం కేసీఆర్ పేషీలోని భూపాల్‌రెడ్డికి రోజూ మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదన్న కారణంగా అందరూ కలిసి తనను బలి పశువును చేశారని తెలిపారు. తనను సస్పెండ్ చేసిన రోజే ఆ స్థానంలో వెలమ సామాజిక వర్గానికి చెందిన ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించారని, నిజానికి అది రాష్ట్రస్థాయి పోస్టు అని, దానిలో కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించకూడదన్న నిబంధనలు ఉన్నాయని వివరించారు. అయినా వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. విచారణ సమయంలో అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ, శాట్స్ మేనేజర్‌లకు అడ్మినిస్ట్రేటివ్ స్వేచ్ఛను ఇచ్చి ఉంటే వారు సమగ్రమైన విచారణ జరిపే వారని, తద్వారా తనకు న్యాయం జరిగేదని తెలిపారు. గత ప్రభుత్వంలో పైవాళ్లు ఏది చెబితే దానినే వేదం అన్నట్టుగా వ్యవహరించేవారని ఆరోపించారు. తనపై ఆరోపణ వచ్చిన రోజు ఉదయం 9 గంటలకే ప్రెస్‌మీట్ పెట్టి మరీ తనను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవరిపైన అయినా ఫిర్యాదు కానీ అనుమానం కానీ వస్తే ముందు చర్యలు తీసుకుని, ఆ తరువాత విచారణ చేస్తామని గత ప్రభుత్వం చెప్పిందని, అదే సరైన విధానమైతే.. ఇప్పుడు ఎవరైనా తప్పులు చేసినట్టు ప్రభుత్వం దృష్టికి వస్తే ముందుగా చర్యలు తీసుకుని, ఆ తర్వాత విచారణ చేయించాలని సీఎం రేవంత్‌ను కోరారు. తన కుటుంబ గౌరవ మర్యాదలను నాశనం చేసిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

## కాళేశ్వరం ఒప్పందాలు బయటపెట్టాలన్న పిటిషనర్‌కు హైకోర్టు అక్షింతలు

▸▸ చట్టం, ప్రజా ప్రయోజన వ్యాజ్యం రూల్స్ చదువుకొని రావాలని చురకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్ని ఒప్పందాలు జరిగాయో వాటన్నిటినీ బయటపెట్టడంతోపాటు పూర్తి వివరాలను కోర్టు ఎదుట ఉంచాలంటూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు మీకు పిల్ రూల్స్ తెలుసా!? అని మండిపడింది. గత ఏడాది నవంబర్ 16న సికింద్రాబాద్‌కు చెందిన మధుగంటి విశ్వనాథ్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నందిత గుహ వాదనలు వినిపించడానికి సిద్ధమవగా ధర్మాసనం జోక్యం చేసుకుంది. "పిటిషనర్‌ను సీనియర్ న్యాయవాది అని పేర్కొన్నారు. హైకోర్టు గుర్తించకుండా సీనియర్ న్యాయవాది అని ఎలా సంబోధిస్తారు? చట్టం, ప్రొసీజర్ తెలియకుండానే ఇక్కడికి వచ్చారా? ఇలాంటి పిటిషన్లు ఎందుకు వేస్తారో తెలుసు. ఆ తర్వాత ఎక్కడెక్కడ చర్చలు జరుపుతారో తెలుసు. హైకోర్టు లైబ్రరీలో కూర్చొని పిల్ రూల్స్, చట్టం చదువుకోండి. ఆ తర్వాత ఈ అంశాలపై పిల్ వేయవచ్చా? లేదా? అనేది మీకే అర్థమవుతుంది. పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ అంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు" అంటూ తలంటింది. పిటిషన్లో మార్పులు చేసి రావాలంటూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## గ్రామసభ కోరం రూల్స్ సవరణపై పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామసభ నిర్వహణకు ఉండాల్సిన 'కోరం' నిబంధనలు సవరిస్తూ జారీ చేసిన జీవో 54 చెల్లదని పేర్కొంటూ ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. లంబాడా హక్కుల పోరాట సమితి నాయకుడు దేవానాయక్ దీనిని దాఖలు చేశారు. గ్రామసభ నిర్వహణకు మూడో వంతు హాజరైతేనే కోరం ఉన్నట్లని, అందులో సగం ఎస్టీలు ఉండాలనే నిబంధనలను సవరించారని, ఇది పెసా చట్టంతోపాటు గిరిజన ప్రాంతాల్లోని ప్రజల హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

## బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ..
## బీజేపీతో పొత్తు పెట్టుకోదు: బాల్క సుమన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, తమ పార్టీ అధినేత కేసీఆర్ సెక్యులర్ నాయకుడని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తమ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని తాము ఎక్కడా చెప్పలేదని, ఎవరినీ అడగలేదన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర నాయకులు బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదనడం తగదని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు మీడియాకు లీక్ లిస్తున్నారని, పత్రికల్లో రాయిస్తున్నారని అన్నారు. 15 రోజుల్లో నలుగురు గురుకుల విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని, దీన్ని పట్టించుకోకుండా రాష్ట్రంలో సమస్యలే లేనట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని, కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బు సంచులు మోస్తున్నారని ఆరోపించారు.

## వైటీపీపీ వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నేడు

నల్లగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో తెలంగాణ సర్కారు నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీపీ) వద్ద మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఇందులో ప్రజల నుంచి సానుకూలత వస్తేనే ప్లాంట్‌కు కేంద్ర పర్యావరణ శాఖ అన్ని అనుమతులు జారీ చేస్తుందని, అప్పుడే ప్లాంట్ నుంచి అధికారికంగా విద్యుదుత్పత్తికి మార్గం సుగమమవుతుందని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఇళ్లు కోల్పోయిన గిరిజనులకు వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కొంతమందికి పరిహారాలు అందలేదని, వాటన్నింటినిపై తేల్చాలని నిలదీసేందుకు భూ నిర్వాసితులు సిద్ధమవుతున్నారు.

## 825 శాతం పెరిగిన ఆక్సిజన్ బెడ్స్

▸▸ దేశవ్యాప్తంగా సర్కారు ఆస్పత్రుల్లో ప్రస్తుతం 5.15 లక్షల బెడ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్ల సంఖ్య 825 శాతం పెరిగినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 5,15,345 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు తెలిపింది. అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ పడకల వివరాలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. ఈ పడకలన్నీ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. 2020 ఏప్రిల్ నాటికి మన దేశంలో కేవలం 62,458 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. ప్రస్తుతం దేశంలో అత్యధికంగా 1,32,314 ఆక్సిజన్ బెడ్స్ మహారాష్ట్రలో ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ఆ రాష్ట్రంలో 11,254 ఆక్సిజన్ బెడ్స్ ఉండేవి. 61,074 ఆక్సిజన్ బెడ్స్‌తో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్(42,221), గుజరాత్(40,708), పశ్చిమబెంగాల్(28,267), కర్ణాటక(27,707) రాజస్థాన్(20,116) నిలిచాయి. తెలంగాణలో 2020ఏప్రిల్ నాటికి సర్కారీ దవాఖానాల్లో 181 ఆక్సిజన్ పడకలుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 13,664కు పెరిగినట్లు కేంద్రం పేర్కొంది. కాగా, దేశవ్యాప్తంగా ఉన్న ఆక్సిజన్ పడకల్లో 25.86 శాతం దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో 1,33,289 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది.

## టీఎస్ పీఈసెట్ షెడ్యూల్ విడుదల

టీఎస్-పీఈసెట్- 2024 షెడ్యూల్‌ను శాత వాహన విశ్వవిద్యాలయం కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు గాను మార్చి 14 నుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆలస్యరుసుంతో మే 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

## ఖమ్మంలో చట్టవిరుద్ధంగా పోలీసుల ప్రవర్తన

▸▸ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రధాన కార్యదర్శి

ఖమ్మం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పోలీసులు గ్రామాల్లో చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలను భయోత్పాతానికి గురి చేస్తున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య ఆరోపించారు. తమ పార్టీ కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యుడు గోపన్న, సభ్యులు ఎస్కే మదార్, కే సురేష్‌ను ఫిబ్రవరి 14న అదుపులోకి తీసుకున్న పోలీసులు అక్రమంగా నిర్బంధించి ఫిబ్రవరి 16న మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని, వీరితోపాటు మరో 24 మందిపై సెక్షన్124-బి కింద కుట్ర కేసులు పెట్టారని విమర్శించారు. సీఎం జోక్యం చేసుకుని పోలీసు శాఖపై సమీక్ష చేయాలని కోరారు.

## జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

**నల్లగొండటౌన్, ఫిబ్రవరి 19:** కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన ఎంజీయూ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన టాస్క్, తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ సహకారంతో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను సోమవారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో ఆయన పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. యువతకు ఉద్యోగ ఉపాధి కలిగించేలా కృషి చేస్తానని అన్నారు. అందుకోసం ప్రతీ రోజు వివిధ సంస్థలతో సమావేశాలు నిర్వహిస్తూ నిజమైన సంస్థల్ని గుర్తిస్తున్నామని, వాటిలో ఉన్న ఉద్యోగ ఖాళీలను గుర్తించి జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఏర్పాటు చేయబోయే నల్లగొండ స్కిల్ సెంటర్ ద్వారా ఒక్కో సెషన్‌లో పది వేల మందికి ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని మంత్రి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సీఈవో గోనారెడ్డి, టాస్క్ సీఈవో శ్రీకాంత్‌సిన్హా, సీఎఫ్‌ఎంసీ సీఈవో సత్యనారాయణ, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

## కంకర టిప్పర్లతో తిప్పలు



టార్పాలిన్ ఏర్పాటు చేయకుండా కంకర తీసుకెళ్తున్న టిప్పర్

కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ డ్రైవర్లు నిబంధనలు పాటించకపోవడంతో ప్రజలతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నార్కట్‌పల్లి మండలంలోని పోతినేనిపల్లె శివారులో ఉన్న ఓ క్రషర్ మిషన్ నుంచి ఆర్డర్లపై కంకర లోడును అమ్మనబోలు రోడ్డు మీదుగా తీసుకెళ్తున్నారు. టిప్పర్ బాడీ లెవల్‌కు మించి కుప్పగా కంకర లోడును రవాణా చేస్తున్న డ్రైవర్లు ఆ కంకర లోడుపై టార్పాలిన్ కప్పకపోవడంతో అవి కిందకు జారిపడుతుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. టిప్పర్ ట్రాలీ అడుగు భాగంలో టార్పాలిన్ వేసి కంకర పొడి (కంకర చూర)ని లోడ్ చేసుకుని ఆ లోడ్ పై నుంచి కూడా టార్పాలిన్ కట్టి తీసుకువెళ్లాల్సి ఉంది. కానీ డ్రైవర్లు అవి ఏమీ చేయకుండానే రోడ్డుపై అతివేగంగా వెళ్తున్నారు. ఫలితంగా కంకర పొడి గాల్లోకి ఎగిరి కళ్లల్లో పడుతూ వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నా పోలీస్, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని తొండ్లాయి గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అంతేకాక టిప్పర్లు అతివేగంగా వెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడి పాడి రైతులు నష్టపోయారు. నిబంధనలు పాటించకుండా టిప్పర్లతో కంకర ఉత్పత్తులను రవాణా చేయిస్తూ ప్రజా భద్రతకు ఇబ్బంది కలిగిస్తున్న కంకరమిల్లు యాజమాన్యంపై కూడా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

● నార్కట్‌పల్లి

## ముస్తాబైన హజ్రత్ అబ్బాస్ దర్గా




పీకేమల్లేపల్లి గ్రామంలోని శ్రీ హజ్రత్ అబ్బాస్‌దర్గా

జిల్లాలో రెండో జాన్‌పహాడ్‌గా, హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచే శ్రీ హజ్రత్ అబ్బాస్ ఉర్సు ఉత్సవాలకు దర్గా ముస్తాబైంది. చింతపల్లి మండలం పీకేమల్లేపల్లిలో గల ఈ దర్గాలో 55వ ఉర్సు ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉర్సు ఉత్సవాలకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. బుధవారం రాత్రి 11 గంటలకు దర్గా ముత్తవెల్లి చాంద్‌పాష గృహం నుంచి గంధం (సందల్) ఒంటెపై భక్తజన సందోహంతో ఊరేగింపుగా వచ్చి దేవుడికి చెల్లించనున్నారు. 22న దర్గా వద్ద అన్నదానం, గుట్టపై ఓం శ్రీగిరి మక్కా మహేశ్వరస్వామి వారి కల్యాణం. 23న భక్తులతో తిరాకులు (దీపారాధన), న్యాదులు (కందుర్లు), మొక్కులు చెల్లిస్తారు. దర్గాను దర్శించుకున్న వారికి కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం.

● చింతపల్లి

## కాల్వల భూసేకరణ సర్వే



ఉదయసముద్రం ప్రాజెక్టు కాల్వలకు భూ సేకరణ చేస్తున్న సర్వేయర్లు (ఫైల్)

నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంలలో నిర్మిస్తున్న ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన కుడి, ఎడమల ప్రధాన కాల్వలతో పాటు డిస్ట్రిబ్యూటరీలు, మైనర్ కాల్వల కోసం చేయాల్సిన భూసేకరణ ప్రక్రియను రెవెన్యూ, నీటి పారుదల శాఖాధికారులు సర్వే చేపడుతున్నారు. నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల ప్రభుత్వ సర్వేయర్లు, సంబంధిత డివిజన్‌ల ఐబీ ఏఈలు, ప్రాజెక్టు నిర్మాణ సంస్థ (ఎంఈఐఎల్)కు చెందిన ఇంజనీర్లు బృందంగా నార్కట్‌పల్లి మండలంలో ఈ సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. మండల పరిధిలో కుడి, ఎడమల ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ, మైనర్ల నిర్మాణం కోసం మొత్తం సుమారు 140 ఎకరాల మేర భూ సేకరణ చేయాల్సి ఉంది. కాల్వల నిర్మాణానికి చేపట్టనున్న భూ సేకరణలో భూమిని కోల్పోతున్న వాస్తవ రైతులెవరో గుర్తించడం సర్వే చేస్తున్న బృందానికి కొంత ఇబ్బందిగా మారింది. కాల్వల కోసం కోల్పోతున్న భూమికి ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంపై పెదవి విరుస్తున్న రైతులు సర్వేకు రైతులు సహకరించడం లేదు.

● నార్కట్‌పల్లి

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

**చింతపల్లి, ఫిబ్రవరి 19:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. మండలంలోని మల్లారెడ్డిపల్లి నుంచి నసర్లపల్లి వరకు రూ. 1 కోటి 75లక్షలతో నిర్మించనున్న బీటీరోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. చింతపల్లి, వర్కాల, తీదేడు, నెల్వలపల్లి, ఉప్పరపల్లి, ఘడియగౌరారం తదితర గ్రామాల్లో సుమారు రూ.60లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో బీటీ, సీసీరోడ్ల నిర్మాణాలతో పాటు మంచినీటి సౌకర్యానికి అత్యధిక నిధులు కేటాయిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండూరు భవానీపవన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, తహసీల్దార్ శంషుద్దీన్, ఎంపీడీవో సుజాత, పంచాయతీరాజ్ డీఈ జీవన్‌సింగ్, డీసీసీ ఉపాధ్యక్షుడు దొంతం సంజీవరెడ్డి, ముచ్చర్ల యాదగిరి, గోవర్ధన్, వెంకటయ్యగౌడ్, పురుషోత్తంరెడ్డి, కె.జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

**చందంపేట:** సీతారామచంద్రస్వామి దేవాలయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలునాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గాగిళ్లపురంలో ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, ఎంపీపీ పార్వతి, జడ్పీటీసీ బుజ్జి లచ్చిరాం, కిన్నెర హరికృష్ణ, ఎంపీటీసీ రజిత రామకృష్ణరెడ్డి, సుజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అమరుల ఆశయ సాధన కోసం కృషి చేయాలి



నర్సింహారెడ్డి స్తూపం వద్ద మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

**చండూరు, చండూరురూరల్, ఫిబ్రవరి 19:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలే ఊపిరిగా పోరాడిన అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త పోరాటం చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. చండూరు వైస్ ఎంపీపీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మందడి నర్సింహారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా సోమవారం చండూరులో ఆయన స్తూపం వద్ద ఏర్పాటు చేసిన సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంతో కలిసి పాల్గొని మాట్లాడారు. మునుగోడు నియోజకవర్గానికి సాగు, తాగునీటి కోసం, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాలపై జరిగిన పోరాటాల్లో మందడి నర్సింహారెడ్డి క్రియాశీలక పాత్ర పోషించాడని గుర్తు చేశారు. శ్రీశైలం సొరంగమార్గం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ చేపట్టిన పాదయాత్రలో నాటి ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డితో కలిసి ప్రజా ఉద్యమాలు చేపట్టాడని కొనియాడారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన చర్లగూడెం, కిష్టరాయిన్‌పల్లి ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు, తాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో మోదీ పాలనలో అవినీతి రాజ్యమేలుతుందని కమ్యూనిస్టులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆడి పాడిన గేయాలు కంటతడి పెట్టించాయి. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ మాదగోని విజయలక్ష్మి, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు రామలింగయ్య, గురిజ రామచంద్రం, బొల్గూరి నర్సింహ, మండల కార్యదర్శి నలపరాజు సతీష్‌కుమార్, నాయకులు గిరి రమ, బొడ్డు వెంకన్న, పల్లె యాదయ్య, సత్తయ్య, దోటి వెంకన్న, కరీం, ఊషయ్య, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ అవార్డు గ్రహీతకు సన్మానం

**నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 19:** పద్మశ్రీ అవార్డు గ్రహీత రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన మధురకవి కూరెళ్ల విఠలాచార్యను విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు లాల్‌కోట వెంకటాచారి, రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్, ప్రధాన కార్యదర్శి కృష్ణమాచారి, నాయకులు శాంతికృష్ణ, వసంతరావు, మదనాచారి, పెండోట సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ



మిర్యాలగూడలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



నల్లగొండలో నివాళులర్పిస్తున్న హిందూవాహిని నాయకులు

**మిర్యాలగూడటౌన్, దేవరకొండ, నల్లగొండ కల్చరల్, నార్కట్‌పల్లి, కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 19:** ఛత్రపతి శివాజీ వీరత్వానికి ప్రతీకని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. హిందూవాహిని ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో కలిసి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత ఆయన అడుగు జాడల్లో పయనించాలన్నారు. పట్టణంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు పెద్దబోయిన రామకృష్ణ, చెరుపల్లి కరుణాకర్, చిలుకూరి శ్యాం, గూడూరు శ్రీనివాసరావు, మధు, పందిరి మహేష్, మదన్‌మోహన్, పురుషోత్తంరెడ్డి ఉదయ్, నాగరాజు, శివ, రాజేష్ పాల్గొన్నారు.

● దేవరకొండలో శివాజీ మహరాజ్ విగ్రహంతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు నేతాళ్ల వెంకటేష్‌యాదవ్, పున్న వెంకటేశ్వర్లు, నక్క వెంకటేష్‌యాదవ్, గడ్డం శివ, గోపిచంద్, ఆదిత్య, శివ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఏకుల రాజరావు, ప్రజాసంఘాల జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు అంజనేయులు, అందుగుల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

● నల్లగొండ పట్టణంలో హిందువాహిని ఆధ్వర్యంలో శివాజీ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. సీతారామచంద్రస్వామి దేవాలయం ఆవరణలో శివాజీ చిత్రపటానికి ఆర్‌ఎస్‌ఎస్ కార్యావాహ బట్టు జనార్ధన్, టౌన్ సీఐలు సత్యనారాయణ, కొండల్‌రెడ్డి, డానియల్, ఎస్ఐలు శంకర్, సురేష్, నాగరాజు ముఖ్యఅతిథులుగా హాజరై శోభాయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో హిందువాహిని జిల్లా ఉపాధ్యక్షుడు తరాల నరేష్, పట్టణ కన్వీనర్ సాయి, ధనుష్, శేఖర్, సతీష్, అనిల్, పవన్, హిందూవాహిని భక్తులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో హిందూవాహిని ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాజు, మేడబోయిన శ్రీనివాస్, కన్నెబోయిన నర్సింహ, అంజిరెడ్డి, నర్సింహ, నాగరాజు, నరేష్, మహేష్, వెంకట్, రమేష్ పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలో ఆంజనేయస్వామి దేవాలయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కుంభం యాదగిరిగౌడ్, ఎండి.జహీర్, బోడ కృష్ణ, అఖిల్, భరత్, గోపి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## బాధ్యతల స్వీకరణ



వీరస్వామి

**మిర్యాలగూడ:** మిర్యాలగూడ నూతన ఎంవీఐగా లాల్‌కోట వీరస్వామి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గత ఎంవీఐ వి.శ్రీనివాస్ వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లగా నాలుగేళ్లుగా శ్రీనివాసరెడ్డి, జిలానీలు ఇన్‌చార్జీలుగా బాధ్యతలు నిర్వర్తించారు. గత నెలలో వీరిద్దరూ ఇక్కడ నుంచి బదిలీ కాగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన్ను కూడా బదిలీ చేస్తూ నియమించడంతో నారాయణపేట డీటీవోగా విధులు నిర్వహిస్తున్న వీరస్వామిని రెగ్యులర్ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన మిర్యాలగూడ ఎంవీఐగా విధులు చేపట్టారు.

● **మర్రిగూడ:** మండల పంచాయతీ అధికారిగా రవికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. రవికుమార్ మాడ్గులపల్లి నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు.

● **గుర్రంపోడు:** నూతన తహసీల్దార్‌గా కిరణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన తౌఫిక్ అహ్మద్ గుడిపల్లి తహసీల్దార్ గా బదిలీపై వెళ్లడంతో వికారాబాద్ జిల్లాలో డీఏవోగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

● **వేములపల్లి:** ఎంపీడీవోగా శారదాదేవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన జానయ్య బదిలీపై నారాయణపేటకు వెళ్లగా సంగారెడ్డిలో విధులు నిర్వహిస్తున్న శారదాదేవి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

# గిరిజనులు సమైక్యతను చాటాలి : బత్తుల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 19:** సంత్ సేవాలాల్ జయంతిని గిరిజనుల ఐక్యతతో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల నిర్వహణపై సోమవారం వివిధ సంఘాల గిరిజన నేతలతో ఆర్డీవో చెన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉత్సవాన్ని గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించాలని సూచించారు. సేవాలాల్ జీవితం గిరిజనులకు ఆదర్శప్రాయమన్నారు. ఈ నెల 24వ తేదీన డివిజన్‌లో సేవాలాల్ జయంతిని నిర్వహించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన నేతలు మాట్లాడుతూ ప్రతి ఏటా ఫిబ్రవరి 15నే నిర్వహించేలా చూడాలన్నారు. అందుకోసం 10వ తేదీనే అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ ఇకపై సేవాలాల్ జయంతిని సరైన సమయంలో నిర్వహించేలా చేస్తామన్నారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ శంకర్‌నాయక్, స్కైలాబ్ నాయక్, నూకల వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ బాలునాయక్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ కరుణాకర్, గిరిజన నేతలు చిట్టిబాబు నాయక్, దశరథ్‌నాయక్, తిరుపతి, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి లింగానాయక్, నాగునాయక్, సిద్ధూనాయక్, మాన్యానాయక్, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే జైవీర్



నిడమనూరులో ఎమ్మెల్యే సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**నిడమనూరు, మాడ్గులపల్లి, గుర్రంపోడు, ఫిబ్రవరి 19:** ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. నిడమనూరు మండలంలోని తుమ్మడం గ్రామంలో నిర్వహించిన గంగమ్మతల్లి జాతరలో సోమవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు సంప్రదాయానికి ప్రతీక అని అన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండే విధంగా దీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు యడవెల్లి రంగశాయిరెడ్డి, అంకతి వెంకటరమణ, జడ్పీటీసీ రామేశ్వరిమట్టారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంకతి సత్యం, కొండా శ్రీనివాస్‌రెడ్డి, ముంగి శివమారయ్య, చినవీరయ్య, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి మండలం పూసలపాడు గ్రామంలో గంగదేవమ్మ పండగలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలను ఆరాధించడం పూర్వకాలం నుంచి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శేపూరి సత్యనారాయణ, రాము, వెంకట్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

● గుర్రంపోడ మండలంలోని కోయగూరవానిబావి గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి మాట్లాడారు. ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రాధాన్యం కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.కిరణ్‌కుమార్, డీటీ ఫరీదుద్దీన్, ఆర్ఐ మురళీకృష్ణ, కిషన్, నాయకులు రవికుమార్, జగదీష్‌రెడ్డి పాల్గొన్నారు.

## మిర్యాలగూడ ట్రాన్స్‌కో డీఈపై సస్పెన్షన్ వేటు?

**మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 19:** వ్యవసాయానికి విద్యుత్ సఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో మిర్యాలగూడ డీఈ వెంకటేశ్వర్లుపై సోమవారం ఆ శాఖ ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం. విద్యుత్ సరఫరాలో అప్రకటిత కోత విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ డివిజన్‌లోని త్రిపురారం మండల కేంద్రంలో కోదాడ-జడ్చర్ల ప్రధాన రహదారిపై ఈ నెల 15వ తేదీ రాత్రి రైతులు నిరసనకు దిగారు. ఈ సంఘటన సోషల్‌మీడియాలో వైరల్ అయింది. దీనిని తీవ్రంగా పరిగణించిన ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు డీఈని బాధ్యుడిని చేస్తూ కఠిన చర్యలకు ఉపక్రమించారు. సంబంధిత శాఖలో పనిచేస్తున్న కిందిస్థాయి అధికారులపై ఆజమాయిషీ కొరవడిందన్న కారణంతో డీఈని సస్పెండ్ చేయడంతోపాటు జిల్లా ఎస్ఈకి షోకాజ్ నోటీసు జారీచేసినట్లు సమాచారం. దీనిపై సీఎండీ కార్యాలయం నుంచి స్పష్టత రావాల్సి ఉందని జిల్లా అధికారులు తెలిపారు.

## భార్య పుట్టింటికి వెళ్లిందని....

**కనగల్, ఫిబ్రవరి 19:** భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపానికి గురైన యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని తర్వపల్లి గ్రామంలో జరిగింది. ఏఎస్ఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ శ్రీకాంత్(27)కు ఐదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన మౌనికతో వివాహం జరిగింది. కొద్దికాలంగా శ్రీకాంత్‌కు భార్యతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీన మరోసారి గొడవ జరిగింది. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. శ్రీకాంత్ మనస్తాపానికి గురై ఈ నెల 18న ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. ఉదయం కూలికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన శ్రీకాంత్ తండ్రి ఎల్లయ్యకు కుమారుడు ఉరి వేసుకొని విగతజీవిగా కన్పించాడు. పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

## ట్రాక్టర్ అపహరణ, కేసు నమోదు

**దేవరకొండ, ఫిబ్రవరి 19:** దేవరకొండ పట్టణంలోని మార్కెట్‌యార్డులో మెడమోని అంజయ్య అనే రైతు ట్రాక్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. దేవరకొండ సీఐ నర్సింహులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య తన మహేంద్ర 2008 మోడల్ ట్రాక్టర్‌ను ఆదివారం రాత్రి మార్కెట్ యార్డులో ఉంచి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం ట్రాక్టర్‌ను తీసుకెళ్లడానికి రాగా ట్రాక్టర్ కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను అపహరించారని బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## 26న మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

**రామగిరి, ఫిబ్రవరి 19:** బడ్జెట్‌పై ఈ నెల 26వ తేదీన మునిసిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు నల్లగొండ మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాకఅలీ తెలిపారు. మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే కౌన్సిల్ సమావేశానికి సభ్యులందరూ సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.



## సంక్షిప్త సమాచారం...

**శాలిగౌరారం:** శాలిగౌరారం మండలం భైరవునిబండ గ్రామంలోని శ్రీ గంగా భవాని సమేత శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో మార్చి 7 నుంచి 11వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే మందుల సామేల్ ఉత్సవాల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దండ యాదగిరిరెడ్డి, నాయకులు దండ రేణుకఅశోక్‌రెడ్డి, దండ శ్రీనివాస్‌రెడ్డి, గౌస్, లతీఫ్, సైదులు పాల్గొన్నారు.

**దేవరకొండ:** పరీక్షల సమయంలో ఏర్పడే మానసిక ఒత్తిడిని తగ్గించాలని పరీక్షలపై ఆసక్తిని పెంచాలని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ అధ్యక్షుడు, సైకలాజిస్టు డాక్టర్ ఎంఎ.కరీం విద్యార్థులకు సూచించారు. పట్టణంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలకు పరీక్షలు, మార్కులు, ర్యాంకులు అంటు ఇబ్బందులకు గురి చేయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

**డిండి:** మండలంలోని కందుకూరు జడ్పీ హైస్కూల్ పాఠశాలలో చదువుతున్న 77మంది విద్యార్థులకు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ) స్వచ్ఛంద సంస్థ రూ.5లక్షలు విలువ జేసే సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ట్రస్ట్ ఏరియా టీంలీడర్ రాంమోహన్ మాట్లాడుతూ దూర ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేందుకు సైకిళ్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కల్లాల సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్, గణేష్, గోపాల్, అచ్చయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

**శాలిగౌరారం:** మండలంలోని అంబారిపేట గ్రామంలో మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్ అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఇతర పార్టీ కార్యకర్తలు చించివేయడం అవివేకమైన చర్య అని బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేష్ అన్నారు.

**పెద్దఅడిశర్లపల్లి:** మండలవ్యాప్తంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పీఏపల్లి విద్యుత్ ఏఈ కావ్య తెలిపారు. స్థానిక అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద గల విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో పాడైన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను మార్చనున్నందున ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అందువల్ల సబ్‌స్టేషన్ పరిధిలో అన్ని ఫీడర్స్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

**శాలిగౌరారం:** మండల కేంద్రంలోని పార్వతీ రామలింగేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో మండల మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారికి జలాభిషేకం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**నార్కట్‌పల్లి:** నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తరగతుల నిర్వహణకు కావాల్సిన వసతులు కల్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఇస్మాయిల్ రాష్ట్ర ఉన్నత విద్యా ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు వినతిపత్రం అందజేశారు.

**త్రిపురారం:** మండలంలోని పెద్దదేవులపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 34 మంది విద్యార్థులకు సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మునీర్, రియాన్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రవి, పంతులు పాల్గొన్నారు.

**మిర్యాలగూడ:** ఎడమకాల్వకు నీరు విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు కోరారు. మండల పరిధిలోని యాద్గార్‌పల్లిలో బోరుబావుల కింద ఎండుతున్న పంటలను ఆయన పరిశీలించారు. వారం, పది రోజులైనా చెరువులు నింపేందుకు సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఇరిగేషన్ అధికారులతో చర్చించి నీటి విడుదలకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

**మిర్యాలగూడ టౌన్:** ఆశ్రమాల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకులు హన్యానాయక్ కోరారు.

● విద్యార్థుల బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ సంఘాల నేతలు తిరుమలగిరి అశోక్, పోగుల సైదులుగౌడ్ కోరారు. విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్పుల బకాయిలు విడుదల చేయకపోవడం సరికాదన్నారు.

**మర్రిగూడ:** పెండింగ్‌లో ఉన్నటు వంటి ఆసరా పింఛన్ల లబ్ధిదారులకు మంజూరయ్యే విధంగా చూడాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య కోరారు. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వివిధ పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారని వారికి పింఛన్ మంజూరయ్యేలా చూడాలన్నారు.

**మర్రిగూడ:** మండలంలోని శివన్నగూడెం గ్రామానికి చెందిన నేర్లకంటి శ్రీనివాస్ జడ్పీ హైస్కూల్‌కు కంప్యూటర్‌ను హెచ్‌ఎంకు అందజేశారు. పాఠశాలపై ఉన్న మమకారంతో విద్యార్థులకు తనవంతుగా సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో కంప్యూటర్‌ను అందజేసినట్లు మాజీసర్పంచ్ చిట్యాల సర్పంచ్ సబితయాదగిరిరెడ్డి, మునగాల వెంకట్‌రెడ్డి తెలిపారు.

**మునుగోడు:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా నిర్వహించే బీజేపీ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షంగౌడ్ పిలుపునిచ్చారు. మునుగోడులో ఈ నెల 22వ తేదీ న నిర్వహించే సంకల్పయాత్ర స్థలాన్ని పరిశీలించారు.

**హాలియా, తిప్పర్తి:** ధూప, దీప నైవేద్యం పథకాన్ని రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు వర్తింపజేయాలని అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదశర్మ, నాయకుడు రామడుగు రామకృష్ణశర్మ డిమాండ్ చేశారు. అన్ని దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చేపట్టిన చలో సెక్రటేరియెట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

**మునుగోడురూరల్:** బీసీ కులగణన నిర్ణయం చారిత్రాత్మకమని, కులగణన తీర్మానాన్ని అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించడం హర్షణీయమని బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌గౌడ్ అన్నారు. కులగణనతో బీసీల ఆర్థిక పరిస్థితులు తెలుసుకోవచ్చని అన్నారు.

**మాడ్గులపల్లి:** మండలంలోని కల్వెలపాలెం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా చింతకాయల సతీష్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**నల్లగొండటౌన్:** ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్లవేళలా కృషి చేస్తుందని ఆ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ బాస్కర్‌రావు అన్నారు. బ్యాంకు ఆధ్వర్యంలో పట్టణంలో రిటైల్ ఎక్స్‌పో నిర్వహించారు. ప్రజలకు వివిధ ఆకర్షణీయమైన రుణ పథకాల గురించి వివరించారు.